సిగ్నల్ పాట్లు

- లంకెలపాలెం కూడలిలో బారులుతీరుతున్న వాహనాలు
- కిలోమీటర్ల మేరకు నిలిచిపోతున్న వైనం
- అధికారులు స్పందించాలని డిమాండ్





అనకాపల్లి నుంచి గాజువాక వైపు వచ్చే సిగ్నల్ పాయింట్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు

అగనంపూడి: జాతీయ రహదారి లంకెలపాలెం కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి. నిత్యం అనకాపల్లి నుంచి గాజువాక వైపు వచ్చే వాహనదారులకు ఈ ఇబ్బంది తప్పడం లేదు. ఉదయం ఆరు గంటల నుంచి పది వరకు, మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు వాహనచోదకులు ట్రాఫిక్ చక్రబంధనంలో ఇరుక్కుపోతున్నారు. ఒక్కోసారి కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఎదురవ్వడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి, అసహనానికి గురవుతున్నారు.

కూడలి వద్ద రహదారి ఇరుకుగా ఉండడం, జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో వేచి ఉండే వాహనాలు రెండు మూడు రౌండ్లు సిగ్నల్ పడితే తప్పా కూడలిని దాటలేని పరిస్థితి. ఒక రౌండ్ సిగ్నల్ పూర్తవ్వడానికి కనీసం ఐదు నిమిషాల సమయం పడుతుంది. ఒక వాహనం కూడలి దాటాలంటే కనీసం రెండు నుంచి మూడు రౌండ్లు పూర్తయితే తప్పా సిగ్నల్ పాయింట్ వద్ద వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో కనీసం పది నుంచి 12 నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోయే పరిస్థితి ఎదురవుతోంది. గాజువాక నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలకు (ఫార్మాసిటీకి వెళ్లేందుకు వీలుగా) ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ తగ్గింది. దీంతో ఈ మార్గంలో రద్దీ సమయాల్లో మినహా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోయాయి. అదే అనకాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు మాత్రం ఫ్రీ లెఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో ట్రాఫిక్ చక్రబంధనంలో వాహనచోదకులు చిక్కుకుంటున్నారు. నగర పోలీస్ కమిషనర్, జీవీఎంసీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈ మార్గంలో కూడా ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి

లంకెలపాలెం కూడలి వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కరించాలి. ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడమే ట్రాఫిక్ నియంత్రకు మార్గం. ఉదయం, సాయంత్రం వేళల్లో కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ నిలిచిపోతుంది. మామూలు సమయాల్లో కూడా అరకిలోమీటరు మేరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–పి.రమణమూర్తి, లంకెలపాలెం

ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలి

అనకాపల్లి వైపు నుంచి వచ్చే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఫ్రీలెఫ్ట్ ఏర్పాటు చేయాలి. కూడలి వద్ద రహదారి ఇరుకుగా ఉంది. ఈ కారణంగా వాహనాలు నిలిచిపోతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ చక్రబంధనంలో చిక్కుకోకుండా చర్యలు తీసుకోవాలి.

–గంగరాజు, మంత్రిపాలెం

ఆనందమనిపింఛెన్

పెన్షన్ పెంపుతో లబ్ధిదారుల హర్షం ● పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి



పింఛన్లను పంపిణీ చేస్తున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



కేఎల్ రావు నగర్‌లో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ ప్రసూన

నూతన సంవత్సరాదిన పింఛన్ లబ్ధిదారుల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇంతకు ముందు రూ.2,500 చొప్పున చెల్లించే పింఛన్ మొత్తాన్ని రూ.2,750కు పెంచిన విషయం తెలిసిందే. సూర్యోదయం కాక ముందే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పెన్షన్ అందజేయడంతో అవ్వాతాతలు మురిసిపోయారు. రూ.2,750 అందుకుని ఆనందం వ్యక్తం చేశారు. గాజువాక నియోజకవర్గంలోని పింఛన్ల పంపిణీ ఆనందోత్సాహాల మధ్య జరిగింది.

పెదగంట్యాడ: అవ్వా తాతలు, దివ్యాంగులు, వింతంతువులకు పెన్షన్ సొమ్ము పెంచడంతో వారి కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పింఛన్ల సొమ్మును రూ.2,750 పెంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్లను వారి ఇళ్లవద్దకే తీసుకెళ్లి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 31,662 పింఛన్లు ఉండగా కొత్తగా 1086 మంది అర్హులను గుర్తించి వారికి కూడా పింఛన్లను అందజేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎక్కడా అవినీతి అక్రమాలకు తావు లేకుండా.. కేవలం అర్హత ఉంటే చాలు ప్రతి పథకాన్ని నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేకువజామున తలుపుకొట్టి మరీ పింఛన్లు అందజేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు కేవలం వారి పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే లబ్ధి చేకూర్చేవారని దుయ్యబట్టారు. కానీ ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం పార్టీలకు అతీతంగా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఏపీడీ సంతోష్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో...

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని పలువురు లబ్ధిదారులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదేశాల మేరకు పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకటరమణ, చిత్రాడ కనకసూర్యపద్మావతి తదితరులు పాల్గొన్నారు.

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, చినఅక్కిరెడ్డిపాలెం సచివాలయాల పరిధిలో నూతనంగా నియమించిన కన్వీనర్లు నంబారు రాజు, నేలపాటి సత్యవతి, సయ్యద్ హుస్సేన్ నేతృత్వంలో వార్డు అధ్యక్షుడు పర్యవేక్షణలో పింఛన్లు అందజేశారు.



పెన్షన్ అందజేస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



శ్రీ దుర్గాదేవి శెట్టిబలిజ వర్తక సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ దుర్గాదేవి శెట్టిబలిజ వర్తక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను షీలానగర్‌లో గల అనూరాధా ఆటో సర్వీసెస్ (పెట్రోల్ బంక్)లో ఆవిష్కరించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముందుగా వర్తక సంఘం ప్రతినిధులు స్వాతంత్ర్య సమర యోధుడు స్వర్గీయ గౌతు లచ్చన్న, దొమ్మేటి వెంట రెడ్డి, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న గ్లో కార్యదర్శి యార్లగడ్డ వెంకన్న చౌదరి, రాజులపాటి రాజా శేఖర్‌ల చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు మట్టవర్తి నాగరాజు, దొమ్మేటి అప్పారావు, దొడ్డి కన్నారావు, జి.వి.వి.సత్యనారాయణ, కడలి త్రినాథ్, కుడిపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి బాసట



బాధితుడికి చెక్కు అందజేస్తున్న తిప్పల రమణారెడ్డి

పెదగంట్యాడ: కష్టాల్లో ఉన్న వారికి మనవంతు సాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత తిప్పల రమణారెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ కొండపై నివాసం ఉంటున్న మహేష్ అనే వ్యక్తి ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఏసీ మెకానిక్ అయిన మహేష్ హైదరాబాద్‌లోని మూడంతస్తుల భవనంపై నుంచి పడిపోయాడు. అతని పరిస్థితిని తెలుసుకున్న ఆయన ఆదివారం రూ.40వేలను అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఆర్, వెంకట్, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయ కన్వీనర్లుగా వాసు, అప్పలరాజు





ఐతి అప్పలరాజు, ఇల్లపు వాసు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లేమర్తి వార్డు సచివాలయ కన్వీనర్లుగా ఎదురువానిపాలెంకు చెందిన ఐతి అప్పలరాజు, లేమర్తికి చెందిన ఇల్లపు వాసులను నియమించారు. ఈమేరకు వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి తెలిపారు. వార్డులోని లేమర్తి వార్డు సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వీరు సమన్వయంతో పనిచేసి అర్హులందరికీ అందేలా చేస్తారని ఆమె తెలిపారు. సచివాలయ కన్వీనర్లుగా నియమించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం సందర్భంగా నూతన సంవత్సరం నాడు వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా వేకువ జామున ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి,ఉదయ కృష్ణమాచార్యులు, హరినారాయణ స్వామి నేతృత్వంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

న్యూ ఇయర్ జోష్

అంబరాన్నంటిన నూతన సంవత్సర వేడుకలు



మేయర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింహపాత్రుడు



ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న జీవీఎంసీ జోనల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది



కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకుంటున్న దామా సుబ్బారావు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నర్సింహారావు

గాజువాక/పెదగంట్యాడ/కూర్మన్నపాలెం/అగనంపూడి/అక్కిరెడ్డిపాలెం/: గాజువాకలో నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. కోటి ఆశలతో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాజువాకలోని పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, కాలనీ అసోసియేషన్లు కేక్‌లను కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పలుచోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. చర్చిలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో శనివారం అర్ధరాత్రివరకు ప్రత్యేక ప్రార్థనలు, పూజలను నిర్వహించారు. శ్రేయోభిలాషులకు, మిత్రులకు, కుటుంబ సభ్యులకు వినూత్న బహుమతులతోపాటు క్యాలెండర్లు, డైరీలను అందజేసి సంతోషాన్ని పంచుకున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకూ వేడుకల్లో జనం మునిగిపోయారు. శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చే నాయకులు, ఆయా పార్టీ నేతలు, కార్యకర్తలతో అధికార, ప్రతిపక్షపార్టీ నేతల ఇళ్లు కళకళలాడాయి.



72వ వార్డులో కేక్ కట్ చేస్తున్న సిరట్ల శ్రీనివాస్



87వ వార్డులో కేక్ కట్ చేస్తున్న కోమటి శ్రీనివాసరావు, ఇతర నాయకులు



నడుపూరులో మంత్రి రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు



ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర



ఆటోనగర్ ఐలాలో కేక్ కట్ చేస్తున్న విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజి తదితరులు



గుడివాడ లతీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గెయిల్ కాంట్రాక్ట్ వర్కర్స్ నేతలు మంగరాజు, చిన హుస్సేన్, శేఖర్, రమేష్



వెదుళ్లనరవ చర్చ్‌లో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్ శామ్యూల్, బ్రదర్ దిలీప్

ఘనంగా ఓబీసీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో పాల్గొన్న స్టీల్ ఓబీసీ నాయకులు, ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ఈనెల 7న జరగనున్న స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా నెహ్రూ పార్కులో మహాత్మా జ్యోతిరావు పూలే ప్యానల్‌కు చెందిన కార్యవర్గ సభ్యులు, విభాగాల సమన్వయకర్తలు, విభాగ కమిటీల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమార్థం ఐదేళ్లుగా తమ కార్యవర్గం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ ప్యానల్ గెలిపిస్తే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో అడహాక్ కమిటీ నాయకులు కోమటి రవిశంకర్, నక్క వెంకటరమణ, నెల్లి అప్పలరాజు, పిల్లి చంద్రరావు, నమ్మి తాతారావు, డాక్టర్ కాంబ్లే, కళ్యాణి, వి.ఎం. నాయుడు, నమ్మి సత్యనారాయణ, పి. గోవిందరాజులు, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సందడి



ఇస్లాంపేట స్కూల్‌లో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిశారు. ఈ సందర్భంగా వారు తమకు విద్యను బోధించిన గురువులను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఖైరున్నీషా బేగం, దేముడుబాబు, దావూద్, వియ్యపు తాతారావు, సోమరెడ్డి, వెంకట అప్పలరాజును ఘనంగా సత్కరించారు.

పీవీ చలపతిరావు మృతి బీజేపీకి తీరని లోటు

గాజువాక: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ తొలి అధ్యక్షుడు పీవీ చలపతిరావు మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ గాజువాక అధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు పేర్కొన్నారు. పీవీ చలపతిరావుకు మృతికి ఆయన నివాళులర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన కష్టపడి పని చేశారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



జాతీయ రహదారిపై లారీని ఢీకొట్టిన కారు (ఇన్‌సెట్) మృతుడు సందీప్ (ఫైల్)


గోపాలపట్నం/కూర్మన్నపాలెం : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదానికి సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్లపూడికి చెందిన సందీప్ ఓలా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నలుగురు ఫ్రెండ్స్‌తో కలసి న్యూ ఇయర్ కావడంతో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత బీచ్‌కు వెళ్లారు. తిరిగి ఉదయం 4 గంటల సమయంలో బయలుదేరారు. ఎయిర్‌పోర్టు జంక్షన్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న లారీ కుడివైపు సిగ్నల్ లేకుండా తిరగడంతో వెనకారులో వస్తున్న వారు అదుపు చేయలేక ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వడ్లపూడికి చెందిన సందీప్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో ముగ్గురు చిన్నచిన్న గాయాలతోబయటపడ్డారు.

కుటుంబంలో విషాదం: చిన్నతనం నుంచి కిరాణా దుకాణాల్లో పనిచేస్తూ..ఎలక్ట్రికల్ పనులు నేర్చుకుని భీమవరంలోని ఓలా ఎలక్ట్రికల్ వాహనాల కంపెనీలో చేరాడు. తండ్రి ఫార్మా కంపెనీలో చిరుద్యోగి. తల్లి ఆరోగ్యం కూడా అంతంతమాత్రంగా ఉంది. చేతికి అందొచ్చిన కొడుకు అర్థంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

సింహాచలం: ధనుర్మాసంతో పాటు నూతన సంవత్సరం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం వేకువ జాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాల్లో సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో వేంచేయజేశారు.ఆలయ బేడా మండపంలో వైభవంగా తిరువీధి నిర్వహించారు. ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోదాదేవి తిరువీధి నిర్వహించి హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఈపూజలు నిర్వహించారు.

సాయినాథునికి 108 రకాల పండి వంటలతో నైవేద్యం



పిండి వంటలు, ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

పెదగంట్యాడ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిధామంలో కొలువై ఉన్న సాయిబాబాకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు చేయించారు. ఈ సందర్భంగా బాబాకు 108 రకాల పిండివంటలను నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం బాబాకు విశేష పూజలు చేయనున్నామని తెలిపారు. బాబాను దర్శించుకునే భక్తులకు పూజ చేసిన తులసి మొక్కలు పంపిణీ చేయనున్నామని చెప్పారు.

నూతనోత్తేజంతో ఉక్కు ఉద్యమం



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: నూతన సంవత్సరంలో నూతనోత్తేజంతో ఉక్కు అమ్మకానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద 689వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, పి.శ్రీనివాసరాజు, నమ్మి రమణ, జి.శ్రీనివాస్ , ఒప్పంద కార్మిక సంఘం ప్రతినిధులు నందికి తాతారావు, పిట్టా రెడ్డి, పి.నారాయణ, సన్యాసిరావు, పి.మహేష్, యు.సోమేష్, చట్టి నరసింగరావు, శ్యాంసుందర్, సిహెచ్. రాము, సింహాచలం, సోమినాయుడు, ఎస్.పైడిరాజు, వి.సోమేష్ పాల్గొన్నారు.